# ప్రొఫెసర్ పరమేశం

ప్రొఫెసరు పగమేశం అప్పుడే తనకి జరిగిన సన్మానసభ నుండి యింటికి వచ్చాడు.

మెడనిండా మోయలేనన్ని పూలమాలలు. కళ్ళలో సంతోషాతిశయంతో గూడిన కలవరం. గుండెనిండా ఏదో మానసిక స్థితిని అతడెన్నడూ పొందలేదు.

నిద్రలో నడిచే మనిషిలా తనకి తెలియకుండానే యాంత్రికంగా సభలో తనకి జరిగిన సత్కారాన్ని స్వీకరించాడు. ఎంతోమంది కవులు, పండితులు, విద్యావేత్తలు ప్రకటించిన అభినందలను అందుకున్నాడు. అంతర్జాతీయ కవితల పోటీలో ప్రథమ బహుమతి నందుకుని మూడువారాల పాటు విదేశపర్యటన చేసి, న్యూయార్కులో బహుమతిని

తీసుకుని ఇండియాకి తిరిగివచ్చిన సందర్భంగా యీ నాటి సన్మానసభ ఏర్పాటు చేయబడింది.

ప్రొఫెసరు పరమేశాన్ని ఇంటివద్ద దించటానికి కారులో అతనితోబాటు నలుగురు యువకులు వచ్చారు. అందరికీ 'గుడ్ నైట్' చెప్పి సాగనంపి యింటిలోపలికి వెళ్ళాడు ప్రొఫెసరు పరమేశం.

భర్త సన్మానసభనుండి తిరిగి వచ్చాడన్న వార్త విని అతనికోసం అప్పటిదాకా ఎదురుచూస్తూన్న సీత పరుగెత్తుకుంటూ బయటకు వచ్చింది.

ముఖం, కాళ్ళూ తప్ప శరీరంలోని ఏ భాగమూ సరిగా కనబడనంతగా పూలమాలతో నిండిఉన్న భర్త-పరమేశాన్ని చూస్తూనే ఎవరో కొత్తమనిషిని చూసినట్లు చటుక్కున ఆగిపోయింది సీత.

"ఈయన...యీాయన...తన భర్తేనా? తను...తను ఇతని భార్యేనా? ఇది కలా, నిజమా?" అలా సాగిపోతున్నాయి సీత ఆలోచనలు.

సీత ఆశ్చర్యంగా, భయంగా, భక్తిగా మాటా పలుకూ లేకుండా భర్తవంక కళ్ళప్పగించి చూస్తోంది.

ఆయన-ప్రొఫెసర్ పరమేశం-ఎంతో ఎత్తున, తనందుకోలేనంత ఎత్తున, ఉన్నట్లు, ఆయన ఎన్నో యోజనాల దూరంలో తను ఎన్ని జన్మలు పరుగుపెట్టినా చేరుకోలేనంత దూరంలో వున్నట్లు అనుభూతి కలుగసాగింది సీతకు.

భయంతో బిగుసుకుపోయి, భక్తితో నిండిపోయి కట్టెలా నిల్చుండిపోయింది సీత గుమ్మందగ్గరే.

ఆమె కళ్ళలోని బెదురు. ఆ నిల్చున్న తీరులోని విధేయత అతని గుండెను మరింత కలచివేశాయి. ఆ అమాయకత, బుడబుక్కలవాడిని మొదటిసారిగా చూచినప్పుడు బస్తీ కుక్క కళ్ళల్లో పొడసూపే బెదురు - సూటులో ఉన్న తెల్ల దొర అమాంతం గూడెంలో ప్రత్యక్షమయితే కొండజాతిపిల్ల కళ్ళల్లో కదిలే బెదురు - చూడలేక తల వాల్చేసుకున్నాడు ప్రొఫెసరు పరమేశం.

తనకీ భార్యకీ మధ్య మానసికంగా ఎంతదూరం ఉందో మొదటిసారిగా తట్టింది ప్రొఫెసర్ పరమేశానికి. వెంటనే ఖంగుమన్న కంఠంతో పార్వతి విరగబడి నవ్వుతున్నట్లు అనిపించి – ఆ ధ్వని వెన్నుపూసలోనుండి జరజరా అన్నివైపులకూ పాకుతూ వళ్ళంతా ఆక్రమించింది- పాలిపోయిన ముఖంతో నిస్సత్తువగా కుర్చీలో కూలబడిపోయి ఆధారం కోసం అన్నట్లు "సీ...తా ?" అంటూ పిలిచాడు అస్పష్టంగా.

ఆ పిలుపు అతని పెదవులను, దాటి రాలేదు. కాని అతని ముఖ కవళికలు చూసి అతను సుస్తీగా ఉన్నాడని గ్రహించిన సీత తేరుకుని ఒక్క-పరుగున అతనివద్దకు చేరుకుంది. "ఏమండీ ఏమయింది ?" అంటూ అతని భుజాలు పట్టుకుని ఆదుర్దాగా అడిగింది. "నీళ్ళు" అన్నట్లు నోటితో

చూశాడు, వెంటనే గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చి త్రాగించింది. నీళ్ళు త్రాగిన తరువాత "అమ్మా" అంటూ మామూలు ప్రకారం మూలగటం ప్రారంభించాడు ప్రొఫెసరు పరమేశం.

ఆ చిరపరిచితమైన మూలుగు వినగానే సీతకి కొండంత ధైర్యం వచ్చింది. అవును? ఈయన తన భర్తే! రోజూ మూలుగుతూ వ్రాసుకుంటూ యూనివర్శిటీకి వెళ్ళి వచ్చి రాత్రిళ్ళు తనని కౌగలించుకుని పడుకునే భర్తే!

తనకు అలవాటైన వ్యక్తి చూసేక గబగబ మెడలోని దండలన్నీ తీసేసింది సీత.

ఒక్కొక్క దండ తీస్తూ, "అబ్బ? ఎంతబాగున్నాయో దండలు! ఇంత పెద్ద గులాబీదండా? గులాబీపూలంటే నాకెంత యిష్టమో! ఇన్ని పూలు మరీ జడలో ఎట్లా పెట్టుకోవటం పక్కనిండా పరచేస్తానెండి! ఇది... గంధం పూల దండా? ఎంత చక్కని వాసనో! గంధం వాసనంటే నాకు చాలా ఇష్టం! ఈ దండ తీసుకెళ్ళి నా ఇనప్పెట్లో పెడ్తాను. పట్టుచీరలన్నీ గంధం వాసనతో ఘుమఘుమలాడతాయ్ చూడండి..." యిలా మాట్లాడుకుపోతూనే ఉంది సీత.

ఆమె అమాయకపు ధోరణి చూస్తుంటే పరమేశానికి కడుపులో దేవినట్లవుతోంది. మళ్ళీ వెన్నుపూసలో అదే బాధ! పకపక నవ్వుతున్న పార్వతి!

"ఏం పరమేశం ? ఇప్పుడు నీ ప్రాణానికి హాయిగా ఉందా! నువ్వు కోరుకున్నంత గొప్పవాడివయ్యావు. కోరు కున్నంత మంచి భార్యను పొందావు. సుఖంగానే ఉన్నావుగా ఇంకా ఎందుకలా బాధపడతావ్ ?" దెప్పి పొడుస్తూ నవ్వు తోంది పార్వతి.

ఇల్లంతా పార్వతి నవ్వులే! ప్రపంచమంతా పార్వతి తోనే నిండిపోయింది. పార్వతి! పార్వతి! తనని ప్రేమించి తనని వదిలిపెట్టిన పార్వతి... ఇంకా తనని వెన్నాడుతూనే ఉంది. ఉహూఁ కాదు తనే పార్వతి స్మృతులను వెన్నాడు తున్నాడు. పార్వతి నిర్వికారంగా తన జీవితంనుండి తొలగి పోయింది. తన ట్రబుల్డు కాన్షెన్స (Troubled Conscience) ఆమె స్మృతులను వెన్నంటుతూ తనకి శాంతి లేకుండా చేస్తోం పార్వతీ! పార్వతీ! నువ్వే గెల్చేవు. నా అహంకా రమే నిన్ను నాకు దూరం చేసింది. పార్వతీ! నువ్వే గెల్చేవు! పార్వతీ నువ్వే గెల్చేవు:—

"అయ్యో! ఏమిటండీ! అలాకళ్ళు తేలేస్తున్నా రేమిటి? ఏయ్‌రంగయ్యా! ఎక్కడున్నావ్ యిలారాఅంటూ భయంగా నౌకరును కేకేసింది సీత. రంగయ్య పరుగెత్తు కుంటూవచ్చాడు. "అయ్యగారిని పట్టుకో. మంచం మీద పడుకోపెట్టాలి. డాక్టర్‌కి ఫోన్ చెయ్యాలి" అంది.

(20)

ఇద్దరూ కలసి ఆయనను పట్టుకుని మంచంమీద పడు కోబెట్టారు.

ఫోన్ చేసిన ఇరవై నిమిషాలకు డాక్టరు వచ్చాడు. పరమేశాన్ని పరీక్ష చేసి, "ఏం భయపడకండి. ఉదయం నుండి మీటింగుల్లో, స్నేహితులతో హడావిడిగా ఉన్నారు కదా ! స్ట్రెయిన్‌కి తట్టుకోలేక పోయారు. విశ్రాంతి తీసుకుంటే అదే పోతుంది!" అంటూ మత్తుయింజెక్షన్ యిచ్చేడుడాక్టరు.

అరగంటలో మగత నిదురలోకి జారుకున్నాడు పర మేశం. ఐనా అతని మనసు తీవ్రంగా ఆలోచిస్తూండటంవల్ల అనేక రూపాలు, సంఘటనలు, ధ్వనులు కలల రూపంలో ప్రత్యక్షమైన అతనిని అర్ధ సుషుప్తావస్థలో కలవర పెట్ట సాగినయ్.

ఎలాగో తెల్లవారింది. నరాలలో కెక్కిన మత్తువల్ల మనిషి కాస్త ప్రశాంతంగా కనపడ్డాడు.

ఎలాగుంది !" అంటూ అడిగింది సీత.

"బాగానే ఉంది" నీరసంగా సమాధానమిచ్చాడు పర మేశం. సీత మరి ప్రశ్నించలేదు. అతనిదగ్గర కూడా కూర్చో లేదు. తన పనులలో మునిగిపోయింది.

సీతకి భర్త దగ్గర ఎప్పుడూ చనువులేదు. రాత్రిళ్ళు అవసరం కొద్దీ భర్త దగ్గరకు తీసుకున్నప్పుడు తప్ప అతని శరీర స్పర్శ ఆమెకు ఎప్పుడూ తటస్థపడదు.

ఆ సంగతి పరమేశానికి కూడా తెలుసు, సీత తనన వంటరిగా వదిలి వెళ్ళిపోయిన తరవాత అదే విషయం ఆలోచిస్తూ కూర్చున్నాడు.

పార్వతి అయితేలలా చేసేదా? తనని అల్లుకు పోయేది "నొప్పి ఎక్కడ?" అంటూ వళ్ళంవా తడిమినట్లే తడిమి చక్కలి గింతలు పెట్టి నవ్వించేది తన ఒళ్ళో పడుకో పెట్టుకుని జుట్టంతా చెరిపేసి "అచ్చు 'మజ్నూ'లా ఉన్నావు" అంటూ నవ్వేది.

సీతకి తనదగ్గర చనువేలేదు. తనంటేభయం, భక్తితో భార్యగా తన విధులన్నీ సక్రమంగా నిర్వర్తిస్తుంది, మనిషికి శారీరకావసరాలే కాక మనోధర్మం కూడా ఉంటుందని. మేధో ప్రపంచం అనేది ఒకటి ఉంటుందన్న విషయం ఆమె ఊహకు కూడా అందదు.

పార్వతి, ప్రొఫెసర్ పరమేశానికి మొదటి భార్య, ఇద్దరూ ఒకే యూనివర్సిటీలో రీడర్లుగా పనిచేస్తున్నప్పుడు ప్రేమించి పెళ్ళి చేసుకున్నారు.

ఇద్దరికీ లిటరేచర్‌లో మంచి అభినివేశం ఉంది విజ్ఞాని దాహంఉంది. తేడా ఆల్లా రమేశం తరుచుగా ఏదో ఒకటి వ్రాస్తూండేవాడు, పార్వతి వ్రాసేదికాదు. కాని విమర్శనాత్మకంగా చదివేది ప్రతి విషయాన్నీ కవిత్వం "నీకు

యాన్నీ, "నీకు కవిత్వం వ్రాయటం రాదు కనుకనే క్రిటిక్‌వి అయ్యావు" అనేవాడు పరమేశం హాస్యంగా.

"నీలో పాండిత్యం లేదు కనుకనే కవి వయ్యావు" అనేది పార్వతి ఎత్తి పొడుపుగా.

అలా ఒకరి నొకరు దెప్పి పొడుచుకుంటూనే, సన్నిహితు లయ్యారు. అంత దగ్గరగా వచ్చేక యిక ఆ అడ్డం కూడా ఎందుకని పెళ్ళి చేసుకున్నారు.

అప్పటికి ఇద్దరి వయస్సూ ముఫ్ఫైపైనే, వారి పెళ్ళి సింపుల్‌గా జరిగినా అందరూ ఘనంగా చెప్పుకున్నారు. "ఐడియల్ కపుల్" అన్నారు. "వారి వివాహం రెండు మేధస్సుల, కలయిక" అన్నారు మేధావులు "రెండు హృదయాల సంగమం" అన్నారు కవులు. పెళ్ళయిన తరువాత పార్వతిలో ఎలాంటి మార్పూ లేదు. మార్పు వచ్చిందల్లా పరమేశంలోనే.

ఇన్నాళ్ళూ కొలీగ్‌గా స్నేహితురాలిగాచూసే పార్వతి భార్య అవటంతో ఆమెను వేరే కోణంలో చూడటం మొదలెట్టాడు పరమేశం.

పార్వతిలో "భార్య" కుండాల్చిన లక్షణాలేవీ లేవని గ్రహించి తరతరాల భారత సాంప్రదాయాలను జీర్ణించుకున్న అతని హృదయం క్షోభ పడసాగింది. పరమేశం ఇంగ్లీషు

సాహిత్యాన్నంతటినీ ఆ పోశనం పట్టాడు. ఎంతో మంది పాశ్చాత్య రచయితలతో, కవులతో కలం స్నేహం చేశాడు పెళ్ళయ్యేసరికే రెండుసార్లు విదేశాలు "టూర్" చేసి వచ్చాడు. ఐనా పెళ్ళి విషయం వచ్చేసరికి అతనిలోని "ప్రాథమిక వ్యక్తి"యైన భారతీయ భర్త డామినేటింగ్‌గా ప్రవర్తించ సాగాడు.

క్లాసు రూములో ఫుల్‌సూటులో నిల్చుని ఆంగ్ల సాహిత్యంలోని స్త్రీ పాత్రలను గురించి "డ్రమటిక్"గా వర్ణించి చెప్తూ ఎమ్మే విద్యార్థుల హృదయాలలో చెరగని ముద్ర వేసే అతని వ్యక్తిత్వం వివాహ పరిధిలోకి ప్రవేశించే సరికి ఎంతో సంకుచితంగా దిగజారిపోసాగింది. పార్వతిలో భారతీయ స్త్రీ లక్షణాలేవీ లేవన్న అనుమానం మొలకెత్తి శాఖోపశాఖలై అతనిలోని సహనాన్ని రెచ్చగొట్టింది. పైగా పరమేశం వ్రాసే ప్రతి కవితనూ విమర్శించేది పార్వతి. అది మరీ భరించరాని విషయమైపోయింది.

పార్వతి తన భార్యకదా! భార్య అంటే పురుషుడి అర్ధాంగి భర్తలోని గొప్పదనాన్ని గుర్తించి గౌరవించడం భార్యలక్షణం. పార్వతి తనని విమర్శిస్తుందేమిటి? పార్వతికి తన మీద ప్రేమ లేదా? అంటే అలా అనుకోవటానికి ఆధారాలేం లేవు.

పార్వతి ప్రవర్తన పెళ్ళి కాకముందు, పెళ్ళయిన తరువాతకూడా ఒకే రకంగా ఉంది. పెళ్ళికాక ముందు పార్వతి తనని ప్రేమించలేదనుకోవటం హాస్యాస్పదం. ఎంత ప్రేమలేకపోతే తన కవిత్వాన్ని, తనలోని ప్రతివిషయాన్నీ, విశితంగా విమర్శిస్తూ కూడా తనని పెళ్ళి చేసుకుంటుంది?

కానీ అదే ప్రవర్తనని పెళ్ళయినాక భరించలేకపోయాడు పరమేశం. పెళ్ళి చేసుకోవటం ద్వారా పార్వతి నోరు నొక్కెద్దామన్న కోరిక అంతరాంతరాల్లో తనకెక్కడో ఉండటంవల్లనే అసలు తను పార్వతిని వివాహం చేసుకున్నాడేమో ననిపిస్తుంది యిప్పుడాలోచిస్తుంటే.

తన భార్య అయినతరువాత ఆమె తనకంటే ఒకమెట్టు తక్కువలో ఉంటుందని, కనుక తనని విమర్శించే హక్కును, స్వాతంత్ర్యాన్ని పోగొట్టుకుంటుందని అతనికి తెలియకుండానే అతనిలో ఒక భావం ఏర్పడి పోయింది. ఆమె మెడలో మూడు ముళ్ళూవేసి తన అహాన్ని కాపాడుకోవటమేకాక ఆమె అహాన్ని నొక్కిపట్టాననికూడా భావించాడు పరమేశం.

కానీ వివాహం తరువాత తన ఆలోచనలకు తగ్గట్టుగా పరిస్థితులు లేవు. పార్వతి ఎప్పటిలాగే తన కవిత్వాన్ని విమర్శించసాగింది "నువ్వెంతసేపూ మాటలకోసం డిక్షనరీ వెతు

కుతావు. నీ భావాలలో బలం ఉంటే రూపందానంతట అదే వస్తుంది.

అలావచ్చిన పదం ఎంత సామాన్యమైన చాలా శక్తివంతంగా ఉంటుంది" అనేది. "నీకు వ్రాయగల శక్తి కన్నా ఏదో వ్రాయాలన్న తపన ఎక్కువ. ఎక్కువ సంఖ్యలో కవితల నల్లగలుగుతావేమోగాని గొప్ప కవిత్వం మాత్రం వ్రాయలేవు." అనేది పార్వతి.

ఆ మాటలు వింటుంటే పరమేశంలోని ప్రొఫెసరు అహం దెబ్బతిన్నది.

అతనిలోని కవి హృదయం కృంగిపోయింది.

"భార్యగా ప్రోత్సహించ వలసిన దానివి నువ్వే యిలా నిరుత్సాహ పరిస్తే ఎలా?" అని ఒకసారి పార్వతి మొహం మీదనే అడిగాడు కూడా.

మీరు దీనికోసం ఎందుకంతగా బాధపడిపోతారో నాకర్థంకావటంలేదు. మీరు కవిత్వం వ్రాయకపోతే లోకం తల్లకిందులై పోదు. ప్రళయం ముంచుకురాదు. మీరింకా చదవండి. విజ్ఞానాన్ని పెంపొందింప జేసుకోండి, మీ విజ్ఞానం మీ మేధస్సును వికసింప జేస్తుంది. మీ హృదయాన్ని విశాలం చేస్తుంది. అది చాలదా? కవిత్వం వ్రాసి తీరాలన్న పట్టుదల ఎందుకు?" అన్నది పార్వతి.

ఆమె మాటలు ఏమాత్రం రుచించలేదు పరమేశానికి. పైగా అతనిలో ఎలాగైనా కవిత్వం వ్రాసి తీరాలన్న పట్టుదల పదిరెట్లు పెరిగింది.

అతని కవితలకు అంతగా గుర్తింపు వచ్చేదికాదు. ఆ బాధంతా పార్వతి మీద కోపంగా మారేది.

"నీ మూలానే నా కవిత్వానికి గుర్తింపు రావటం లేదు" అన్నట్లు ప్రవర్తించేవాడు.

"నీ ఉసురే తగిలింది నా కవిత్వానికి" అనేవాడు.

అతని ధోరణి పార్వతికి అసహ్యం వేసింది.

ఇద్దరిమధ్యా ఘర్షణలు ప్రారంభమైనాయి. చిలికి చిలికి గాలివానైనట్లు వారిద్దరిమధ్యా బయల్దేరిన సాహిత్య చర్చలు వ్యక్తిగతమైన ఆరోపణలతో, దూషణవాక్యాలతో ముగిసేవి.

రాయీ రాయీ ఒరుసుకొంటే నిప్పు పుడుతుంది. రెండు బలమైన వ్యక్తిత్వాలు ఘర్షణపడితే హృదయంలో అగ్ని పుడుతుంది.

ఆ అగ్ని యింటిని దహించ సాగింది.

"ఈ మంటలు నేను భరించలేను" అంటూ పార్వతి ఇద్దరు పిల్లల్ని తీసుకుని ఏడేళ్ళ సంసార జీవితాన్ని వదులుకుని ఢిల్లీలో ప్రొఫెసరు పోస్టువస్తే వెళ్ళి అందులో జాయినయింది.

రెండేళ్ళ తరువాత కోర్టుద్వారా విడాకులు పుచ్చుకున్నారిద్దరూ.

పార్వతి దూరమైనా పరమేశం కవిత్వం వ్రాయటం మానలేదు. పార్వతిమీద కక్ష సాధించాలన్న తీవ్రతతో మరింత పట్టుదలతో వ్రాయసాగాడు.

"తీయగా తీయగా రాగం" అన్నట్లు వ్రాయగా వ్రాయగా అతనుకూడా ఒక ధోరణిలోపడ్డాడు. నాలుగైదు కవితలు ప్రఖ్యాత ఆంగ్ల పత్రికలలో అచ్చయినయ్.

ఆ కవితలను అచ్చులో చూసుకున్నప్పుడు అతనిలో కలిగిన ఆనందం, గర్వం అంతా యింతా కాదు.

పార్వతి ఎదురుగాఉంటే తన సంగతేమిటో తను ఎంత గొప్పవాడో స్వయంగా చూసేది కదా!

"ఇప్పటికైనా మించిపోయిందేముందిలే! పార్వతి పుస్తకాల పురుగు. కనపడ్డ అక్షరం ముక్కల్లా చదివేస్తుంది. తన కవితలను యీపాటికి చదివే ఉంటుంది. తనలాటి గొప్ప కవిని భర్తగా పొందికూడా వదులుకున్నందుకు పశ్చాత్తాప పడుతుంది. కుళ్ళికుళ్ళి ఏడుస్తుంది" అని కసిగా నవ్వుకునే వాడు పరమేశం.

అయితే కవిత లచ్చవటంతోనే జీవితంలో పరిపూర్ణత

వచ్చిందనుకోలేదు. నలభై దాటిన అతని శరీరం, పదేళ్ళ సంసార జీవితానికి అలవాటుపడ్డ అతని శరీరం ఒక తోడుకోసం పరితపించ సాగింది.

భారత దేశంలో చేసుకుంటాననే మగధీరుడే ఉండాలి కాని పెళ్ళికాని, అమ్మాయిలకేం కొదవ? రెండో పెళ్ళయితేనేం, నెలకి రెండువేలు సంపాదిస్తున్నాడు. విదేశాలు వెళ్ళి వచ్చినవాడు. ఆంగ్ల కవిగా భారత దేశమంతటా పేరు ప్రఖ్యాతులు గడించుకుంటున్నవాడు. అమ్మాయినిస్తామంటూ ఎంతోమంది ముందుకు రాసాగారు.

అందులో అతనికి నచ్చిన సీత యిల్లాలుగా ఇంటికి వచ్చింది. నాలుగు సంవత్సరాలలో ముగ్గురు పిల్లలను కన్నది.

సీతది చాలా పేద కుటుంబం. పెళ్ళయ్యేటప్పటికి ఆమె వయస్సు ఇరవై రెండు. చదువుకోని పేద కుటుంబాలలో ఇరవై రెండేళ్ళంటే పెళ్ళికాని అమ్మాయికి అది చాలా పెద్ద వయస్సుక్రిందే లెక్క. సీతకి పెళ్ళవడం, అందునా ఆమె ప్రొఫెసరు భార్య అవటం తన అదృష్టంగా భావించింది. ఇంగ్లీషు చదవడంకూడా సరీగ్గా రాని సీతకి రోజూ రాత్రిళ్ళు కాగితాలకు కాగితాలు వ్రాస్తూ సంఘంలో పేరు ప్రఖ్యాతులు గడించుకుంటూన్న. తనకంటే రెట్టింపు వయస్సులో ఉన్న భర్తంటే ఎక్కడలేని భక్తి శ్రద్ధలూను. ఆ యింట్లో

దాసీగాకూడా పనికిరాని తను యిల్లాలుగా రావడం ఎన్నో జన్మల సుకృతంగా భావించే. ఆ పుణ్యాన్ని వచ్చే జన్మలో కూడా ప్రసాదించమని రోజూ దేవుడికి దండం పెట్టేది. తులసి కోటకు ప్రదక్షిణాలు చేసేది.

తను కోరుకున్న లక్షణాలన్నీవున్న 'భార్య' దొరికి నందుకు పరమేశంలోని "అహం"సంతృప్తి పొందింది. తనని ఆరాధనగా చూసే ఆమె ముఖం అతని కెంతో గర్వాన్ని కలిగించేది. కాని అ భావాలు అతనిలో ఎంతో కాలం నిలవలేదు.

అతనిలోని పురుషాహంకారం సీతనుచూసి పొంగి పోయినా అతనిలోని మేధావి ఆమెను 'అర్థాంగి'గా స్వీకరించ లేకపోయాడు.

కనీసం తను ఏం వ్రాస్తున్నాడో కూడా అర్థం చేసుకునే శక్తి లేని పిండిబొమ్మలాంటి ఆ మనిషిని 'జీవితభాగస్వామిగా' ఊహించు కుంటానికే ఆతని మనస్సు చిన్నబోయింది. తన లోని 'ప్రాథమిక వ్యక్తి' యొక్క అవసరాలను తీర్చగలదు సీత. కాని తనలోని 'రిఫైన్డు పర్సనాలిటీ'లో భాగం పంచు కునే శక్తి ఆమెకు లేదు.

పైగా సీతను చూసినప్పుడల్లా పార్వతి తెలివి తేటలు, చలాకీ తనం, కుశాగ్రబుద్ధి అన్నీ గుర్తుకువచ్చి అతనికి బాధగా వుండేది.

ఎవరినో 'హత్య చేసినంత ఇది'గా ఫీలవ్వసాగాడు పరమేశం.

ఇప్పుడాలోచిస్తుంటే పార్వతి తెలివితేటలమీద అసూయతోనే అమెను విడిచి పెట్టాడేమో ననిపిస్తుంది పరమేశానికి.

తనతో పార్వతి వ్యక్తిత్వంమీద, తెలివితేటలమీద ఎంత అసూయ ఉందో యిప్పుడు తెలుస్తోంది. తన భార్య తన కంటే తెలివిగలదైతే సహించలేని సామాన్య పురుషుడు తను. ఆమె విమర్శలను స్నేహ పూర్వంగా స్వీకరించి, తన కవిత్వాన్ని 'ఇంప్రూవ్' చేసుకోవటానికి ప్రయత్నించి ఉంటే "విమర్శించేది నా భార్యే కదా! నా పార్వతే కదా!" అన్న వివేచన తనలో ఉంటే యింతదాకా వ్యవహారం వచ్చేదే కాదేమో!

భార్య భర్తలలో ప్రతిభ ఎవరిలో ఉన్నా రెండవ వ్యక్తి గుర్తించి గౌరవించాలి. లోపాలను సర్దుకుపోవాలి.

కాని ఆ జ్ఞానం తనకి లేకపోయింది.

నిజమే...

తను గొప్ప కవిత్వం వ్రాస్తానని, తనని ఎవరూ విమర్శించ కూడదనీ, తన భార్య అయిన పార్వతి అసలే విమర్శించ కూడదనీ తను భావించాడు. క్లాసులో తన విద్యార్థులు ఎలా భయభక్తులతో తన పాఠాలను వింటారో యింట్లో

భార్య కూడా అలాగే తన మాట వినాలని ఆ నాడు తను భావించేడు. ఇప్పుడు సీత అలాగే వింటోంది. ఐనా తనకి నచ్చటం లేదు.

కారణం యేమిటి?

తనకి తెలివితేటలు గల భార్య కావాలి. తననిగుడ్డిగా ఆరాధించాలి. అదీ భార్యని గురించి తన అభిప్రాయం.

పార్వతికి వ్యక్తిత్వం తెలివి తేటలున్నాయి. కాని తనని గుడ్డిగా గౌరవించే అమాయకత్వం లేదు.

సీత తనని గుడ్డిగా ఆరాదిస్తుంది. కాని తనని అర్థం చేసుకునే తెలివితేటలు లేవు.

అందువల్ల సీతను కూడా పార్వతి లాగానే వదిలెయ్యాలా? ఇక దీనికి అంతనేది లేదా?

వ్యక్తిత్వం. అమాయకత్వం పరస్పర విరుద్ధమైన గుణాలు. రెండూ ఒకేవ్యక్తిలో ఎప్పుడూఉండవు. ఒకవ్యక్తి ముఖ్యంగా మేధావి యైన వ్యక్తి తన జీవిత భాగస్వామిని ఎన్నుకునేప్పుడు యీ రెంటిలో ఏ గుణంగల వ్యక్తికావాలో ముందే నిర్ణయించుకోవాలి. అప్పుడే అతని వైవాహిక జీవితం సాఫీగా నడుస్తుంది.

కాని తను పేరాశతో రెండూ కావాలనుకున్నాడు అందుకే పార్వతిని పోగొట్టుకుని బాధపడ్డాడు. సీతని పొందీ బాధపడ్డాడు.

లోపం తనదే. పార్వతిదీకాదు, సీతదీకాదు. ఇలాంటి సంఘర్షణ పరమేశంలో ఎప్పుడు ప్రారంభమయిందో అప్పట్నుండీ అతనిలోని మామూలువ్యక్తి పతనం పోసాగాడు. ముఫ్పైఏళ్ళు బ్రహ్మచారిగా ఉండి కూడా ఏ వ్యసనమూ లేకుండా బ్రతికిన పరమేశం, రెండవ పెళ్ళి చేసుకుని ముగ్గురు పిల్లలనుకన్నాక, తాగుడు, వ్యభిచారం అలవాటుచేసుకున్నాడు

తనలోని 'కవి'ని అవమానపరిచినందుకు పార్వతిని వదులుకున్న పరమేశం తనలోని 'కవి'కి గుర్తింపురాగానే పతనం చెందటం ప్రారంభించాడు. పార్వతి భార్యగా మిగతా విషయాల్లో తనకేలోటూ చెయ్యలేదు. పెద్ద ఉద్యోగం చేస్తూకూడా సాధ్యమైనంతవరకు గృహిణిగా తన బాధ్యతలను సక్రమంగానే నిర్వర్తించేది. అలాటి పార్వతికి అన్యాయం చేసేనన్న బాధ ఒకవైపు, అమాయకురాలైన సీతను ప్రేమించలేక పోతున్నానన్న బాధ ఒక వైపు అతనిని కాల్చుకుతింటుంటే ఆ బాధ నుండి తప్పించుకోవటానికి పక్కదారులు వెతకసాగాడు పరమేశం.

ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించసాగాడు మితిమీరి తాగాడు, తిరిగాడు ఐనాఅతనికి మనశ్శాంతి దొరకలేదు.

పార్వతిమీద కక్ష సాధించానని కవిగా మురిసిపోయినా అతని అంతరాత్మ అతనిమీదనే కక్ష తీర్చుకున్నట్లు అతనిని వేధించ సాగింది. ఆ పరిస్థిలోనే "The Conscience" (అంతరాత్మ) అనే కవితను వ్రాశాడు. దానికి అంతర్జాతీయస్థాయిలో బహుమతి లభించింది. ఆ సంగతి అతని అంతరాత్మ ఒక్కదానికే తెలుసు. అతనికి బహుమతి రావటంచూసి "అంతా సీత అదృష్టం" అనుకున్నారు కొందరు. "సీతవంటి ఉత్తమ యిల్లాలు భార్యగా లభించటం వల్లనే అతను గొప్ప కవి కాగలిగాడు" అన్నారు కొందరు.

కాని అసలు నిజం పరమేశానికి మాత్రమే తెలుసు. పార్వతి దూరమైనా తను కవిత్వం వ్రాస్తున్నప్పల్లా పార్వతే అతని మెదడులో మెదల్తూండేది. "పార్వతి ఈ భావాన్ని వెల్లడిచేయడానికి యీపదాన్ని వాడితే యిలా కామెంట్ చేస్తుంది" అని పార్వతి అక్కడ ఉన్నట్లే ఫీలై వ్రాసేవాడు పరమేశం.

భౌతికంగా దూరమైన పార్వతి తన మేధస్సు నంతటినీ ఆక్రమించు కుంది.

భార్య అయిన పార్వతిని చూసి అసూయపడిన పరమేశం దూరమయిన పార్వతిని 'సోర్స్ ఆఫ్ ఇన్స్పిరేషన్'గా భావించటం అతని కొక్కడికే తెలుసు.

అందుకే ఆ బహుమతి పొందిన దగ్గరనుండీ అతని అంతరాత్మ గిలగిల కొట్టుకోసాగింది. "పార్వతీ! ఈ బహుమతి రావలసింది నాకుకాదు. నీకు" అని నోరారా పార్వతితో చెప్తేగాని తనకీ మనో భారం తగ్గదనిపిస్తోంది కాని ఎంత అసాధ్యమయిన పని! దూరమైన పార్వతి దగ్గరకు వెళ్తే యిటు సీతకు ఆ ముగ్గురు పిల్లలకూ అన్యాయం జరగదని గ్యారంటీ యేమిటి? సీత పార్వతిలా స్వతంత్రంగా బ్రతకలేదు. సీతకు తనతోడు కావాలి.

"ఎలా ఉన్నది ఒంట్లో?" వంటింటి పనంతా ముగించుకుని వచ్చిన సీత అతనికి మూడు గజాలదూరంలో నిలబడి అడిగింది.

"డాక్టరును పిలు, మరోసారి మత్తు ఇంజక్షను యిస్తేకాని మనశ్శాంతి లభించేట్లులేదు" అంటూ పక్కమీద వాలిపోయాడు పరమేశం.

---